క్లుప్తంగా

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, కన్వీనర్

చీమకుర్తి: మండలంలోని ఏలూరివారిపాలెం గ్రామంలో రూ.12 లక్షలతో సైడు కాలువ నిర్మాణానికి శుక్రవారం ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులతో సైడు కాలువ నిర్మిస్తున్నట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏలూరి శ్రీలక్ష్మి, ఏలూరి సుబ్బారావు, సురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హమాలీల పీఎఫ్ చెల్లించాలి

ఒంగోలు టౌన్: పౌరసరఫరాల సంస్థలో హమాలీలుగా పనిచేసి రిటైర్డ్ అయిన వారి పీఎఫ్‌ను వెంటనే చెల్లించాలని హమాలీల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట హమాలీలు ధర్నా నిర్వహించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ మేనేజర్ గ్లోరియాకు వినతిపత్రం అందజేశారు. బిందె అంజనేయులు అధ్యక్షత వహించిన ధర్నాలో బుత్తల గోపాలరావు, నాగరాజు, శేషయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలతో అభివృద్ధి

ఒంగోలు సెంట్రల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ఆర్థిక, ఉపాధి విధానాలతో దేశం అభివృద్ధి చెందుతోందని వక్తలు అన్నారు. త్రోవగుంట విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో శుక్రవారం జిల్లా బీజేపీ యువ మోర్చా సమావేశం నిర్వహించారు. యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పువ్వాడ దామోదర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్, బాపట్ల జిల్లా ఇన్‌చార్జి పీవీ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ యాదవ్, యువమోర్చా జోనల్ ఇన్‌చార్జి అశోక్ రెడ్డి, సోషల్ మీడియా ఇన్‌చార్జి జీవీ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎనుముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చాపల వంశీకృష్ణ

ఒంగోలు: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని డాక్టర్ చాపల వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కేరళ హైస్కూల్లో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన ప్రపంచ సైన్స్ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సైన్స్ జీవన విధానంగా ఉండాలని, ప్రతి విషయాన్ని గుడ్డిగా అనుసరించడం కాకుండా పరిశీలించడం, ప్రశ్నించడం, ఆలోచించడం ద్వారా నిర్ణయం తీసుకోవాలన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయప్రకాష్, కేరళ హైస్కూలు కరస్పాండెంట్ సీటీ మైఖేల్, జనవిజ్ఞాన వేదిక నగర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి టెస్టు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో రాజ్యలక్ష్మి ప్రాకారోత్సవం

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, ఈమని మదన్‌మోహన్, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జేవీవీ చైతన్యం

చీమకుర్తి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాల నుంచి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ అన్నారు. శుక్రవారం చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జవహర్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం పాఠశాల, మండల, జిల్లా స్థాయిలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సై రామిరెడ్డి, గెలాక్సీ గ్రానైట్ యజమాని బదరీనారాయణ, ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్లు, జేవీవీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నల్లూరి వెంకటేశ్వరరావు, చలువాది రమేష్, హైస్కూలు హెచ్‌ఎం జీ వీరాస్వామి, ఏ వీరారెడ్డి, ఎస్ అంజిరెడ్డి, చల్లా శ్రీనివాస్, షేక్ శిలార్ సాహెబ్, స్థానిక హైస్కూలు టీచర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

- అందుకే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి


ఘడియపూడి సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు


కొత్తపట్నం గ్రామ సచివాలయం-2లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఆళ్ల రవీంద్రరెడ్డి

మద్దిపాడు: అర్హులందరికీ పథకాలు అందాయని, అందుకే మనకు ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఘడియపూడి సచివాలయంలో జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నేను మీకు మేలు చేశానని అనుకుంటేనే నాకు ఓటు వేయండని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారా అంటూ ప్రశ్నించారు. ప్రతి గడపలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయని, ఆ ధైర్యంతోనే జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం టీడీపీ నాయకుల అనుయాయులకు మాత్రమే పథకాలు వచ్చాయని, జన్మభూమి కమిటీల ప్రాపకం ఉంటేనే ఎవరికైనా పథకాలు అందాయని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుతం ఎవరి సిఫార్సు అవసరం లేకుండా నేరుగా అర్హులకు పథకాలు అందుతున్నాయన్నారు. ఘడియపూడి సచివాలయం పరిధిలో ఈ నాలుగు సంవత్సరాల కాలంలో మొత్తం 15,20,59,443 రూపాయలను డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఆయా వివరాలతో కూడిన బోర్డును సచివాలయంలో ఎంపీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, పైనం ప్రభాకర్, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, గార్లపాడు సర్పంచ్ దేవరపల్లి గంగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ పండుగ

కొత్తపట్నం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమ పండుగలా వాతావరణం నెలకొందని మండల సచివాలయాల కన్వీనర్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. కొత్తపట్నం గ్రామ సచివాలయం-2లో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే మళ్లీ సీఎం ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు ఎన్ని మారినా చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత నాలుగున్నర సంవత్సరాలలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కొత్తపట్నం గ్రామ సచివాలయం-2 పరిధిలో రూ.27.96 కోట్లను పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారని చెప్పారు. ఎన్నో సంక్షేమ పథకాలు పెట్టి కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కారకుడు అయిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈవోఆర్డీ, సచివాలయ నోడల్ అధికారి ఏ బాలచెన్నయ్య మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఇంకా ఎవరైనా అర్హులు ఉండి పథకాలు అందకుంటే వెంటనే వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ఇచ్చిన సంక్షేమ పథకాలను చదివి వినిపించారు. కొత్తపట్నం గ్రామ సచివాలయం-2లో రూ.27.96 కోట్లతో అమలుచేసిన సంక్షేమ పథకాల బోర్డును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లెయ్య, మెడికల్ సిబ్బంది, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

చీమకుర్తి: సంతనూతలపాడు రెండో సచివాలయం పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ పాల్గొని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యక్షంగా రూ.22.20 కోట్లు, పరోక్షంగా రూ.8.11 కోట్లను లబ్ధిదారులకు అందించారని వివరించారు. కార్యక్రమంలో తన్నీరు రాగమ్మ, దుంపా యలమందారెడ్డి, ఐవీ సుబ్బయ్య, తన్నీరు మోహన్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి...

నాగులుప్పలపాడు: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోందని జెడ్పీటీసీ యాదాల రత్నభారతి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మద్దిరాలపాడు గ్రామ సచివాలయంలో జగన్ పరిపాలనలో ఆ గ్రామ ప్రజలకు అందిన సంక్షేమ పథకాల బోర్డును వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగిందని తెలిపారు. ఆ మంచిని తెలియజేసి ప్రతి కుటుంబాన్ని పలకరించడానికి ఈ రాష్ట్రానికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్, పీడీసీసీబీ డైరెక్టర్ పెనుబోతు రంగారావు, ప్రసన్న, కుమ్మారి సుధాకర్, ఉప్పుగుండూరు శ్రీనివాస ప్రసాద్, కోయి హనుమయ్య, వజ్రంబాబు, ఎంపీడీవో జయమణి తదితరులు పాల్గొన్నారు.

26న సూర్యబలిజ కార్తీక సమారాధన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణ సూర్యబలిజ కార్తీక సమారాధన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఆ సంఘ గౌరవాధ్యక్షుడు బెజవాడ హరిబాబు, సలహాదారుడు సింగంశెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ అంబేడ్కర్ భవనంలో సూర్య బలిజ కార్తీక సమారాధన జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని సూర్య బలిజ ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి బెజవాడ పవన్ కుమార్, డైరెక్టర్ దాసరి కరుణాకర్, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు నట్టువ పురందరదాసు, తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు ఒకే ఒక్క విజ్ఞప్తి

ఒంగోలు: డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఒకే ఒక్క విజ్ఞప్తి వచ్చింది. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో డిపో మేనేజర్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెల్లబాడుకు చెందిన ఉపాధ్యాయుడు పాపిరెడ్డి వెంకటకృష్ణ నుంచి అందిన విజ్ఞప్తి ప్రకారం తెల్లబాడు నుంచి మల్లవరం మీదుగా ఒంగోలుకు గతంలో బస్సు నడిపేవారని, దానిని పునరుద్ధరించాలని కోరారు. అదే విధంగా ధేనువుకొండలో బస్సు రాత్రి ఉంచి మరుసటిరోజు ఉదయం తిరిగి ఒంగోలు నడిపే సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. దీనిపై డీఎం శ్రీనివాసరావు స్పందిస్తూ తప్పకుండా పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే చిత్రలేఖన పోటీలు

- డీఈవో సుబ్బారావు


విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందిస్తున్న డీఈవో సుబ్బారావు


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారి మేధస్సుకు పదునుపెట్టేందుకు చిత్రలేఖన పోటీలు ఎంతో అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ట్రస్టు నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైండ్ మ్యాపింగ్ ద్వారా సృజనాత్మకతను వెలికితీయగలుగుతామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చిత్రలేఖన పోటీల కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యాచారి మాట్లాడుతూ పోటీలకు 750 మంది విద్యార్థులు హాజరవడం ద్వారా మంచి స్పందన లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఫోరం ఫర్ ఆర్ట్స్ కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం సెల్‌ఫోన్లకు ఎడిక్ట్ అవుతున్నారని, వాటి నుంచి బయటకు తేవడానికి చిత్రలేఖనం వంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు వారి మనస్సుల్లో ఊహాచిత్రాన్ని నిర్మించుకుని పేపర్‌పై చిత్రించడం ద్వారా వారిలోని సృజనాత్మకత బహిర్గతం అవుతుందన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి నారాయణరావు మాట్లాడుతూ పిల్లలు అద్భుతాలు సృష్టించగలరన్నారు. ఈ కార్యక్రమానికి ఈవెంట్ మేనేజర్లుగా స్ఫూర్తి శ్రీనివాసరావు, వై.కళాసాగర్, కో కన్వీనర్ డీఎల్ ప్రసాద్, దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు డి.వీరాంజనేయులు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.ఉమామహేశ్వరి, చిత్రలేఖన కమిటీ సభ్యులు బాలకోటయ్య, వెంకట్రావు, వినోద్, సృష్టి ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు తిమ్మిరి రవీంద్ర, రంగుల సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు డీఈవో వీఎస్ సుబ్బారావు ప్రశంసపత్రాలు అందించి అభినందించారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన కలిగి ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: మహిళలు ఆర్థిక స్వావలంబన కలిగి ఉండాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని మల్లవరం గ్రామంలో గల విజయభవన్‌లో సంతనూతలపాడు నియోజకవర్గ డ్వాక్రా మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా లబ్ధి పొంది వారి కుటుంబాలు సుఖశాంతులతో ఉండటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు తోడ్పడ్డాయని తెలిపారు. మహిళా సాధికారత సంపూర్ణంగా జరిగిందనడానికి ఒక్క సంతనూతలపాడు నియోజకవర్గంలోనే వందల కోట్ల రూపాయల నిధులు రావడం నిదర్శనమని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, ఇతర కార్యక్రమాలన్నింటికీ మహిళలు పూర్తి సహకారం అందిస్తూ జయప్రదం చేస్తున్నారని అభినందనలు తెలిపారు. మహిళల ఆనందాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారనడానికి ఇంతకంటే నిదర్శనం లేదన్నారు. అనంతరం మహిళలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలు గురించి వారితోనే చెప్పించి ఆనందించారు. వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దీవెనలు అందించాలని కోరారు. అనంతరం పలు యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో 20 కోట్ల రూపాయల నిధులతో మహిళలకు మినీ టైలరింగ్ యూనిట్లు, కార్లు, పెరటి కోళ్లు, కంప్యూటర్లు, ఆటోలు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. హాజరైన మహిళలకు చీరలు అందజేశారు. ఎమ్మెల్యే పెళ్లిరోజు కావడంతో మహిళలంతా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు మండవ అప్పారావు, కొత్తపల్లి సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, నాలుగు మండలాల ఏపీఎంలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మూడు బుట్టల చెత్త సేకరణ విధానాన్ని పాటించాలి


మూడు బుట్టల ద్వారా చెత్త సేకరణ విధానాన్ని ప్రజలకు వివరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో చెత్త సేకరణకు మూడు బుట్టల విధానాన్ని తప్పకుండా అమలు చేయాలని శానిటేషన్ అధికారులు, సిబ్బందికి ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. నగరంలోని కర్నూలు రోడ్డు, విరాట్‌నగర్ ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి ఇంటికీ మూడు బుట్టలు అందించటం జరిగిందన్నారు. ప్రజలు వాటిని వేరే అవసరాలకు వాడుతున్నారన్నారు. ప్రతి ఇంట్లో మహిళలకు చెత్తను మూడు రంగుల బుట్టల ద్వారా తడి చెత్త, పొడి చెత్త, హానికారక చెత్తగా విభజించి అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. చెత్తను వేరు చేసి ఇవ్వటం ద్వారా తడి చెత్త కంపోస్ట్‌కు నేరుగా చేరవేయవచ్చన్నారు. అదేవిధంగా నగరంలోని డివైడర్లలో ప్లాస్టిక్‌ను తొలగించాలని, మొక్కలు పెరిగే విధంగా డివైడర్లలో చెత్తా చెదారాలను తీసేయాలని సిబ్బందికి సూచించారు. తప్పనిసరిగా రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన ఇందిరానగర్ సచివాలయాన్ని సందర్శించారు. హాజరు రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇంటి పన్ను గురించి అడ్మిన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇందిరానగర్ సచివాలయం పరిధిలో కేవలం 21 శాతం మాత్రమే ఇంటి పన్ను చెల్లించారని, నెలవారీ లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని మిగతా 79 శాతం ఇంటిపన్ను కూడా వసూలు చేయాలని ఆదేశించారు. కుళాయి పన్ను కేవలం 4 శాతం మాత్రమే వసూలు చేశారని, ఈ విధంగా అయితే నగరపాలక సంస్థలో ఏ విధంగా అభివృద్ధి పనులు జరుగుతాయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పన్నులు కట్టని వారిని గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ చంద్రశేఖర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామం పరిశుభ్రంగా ఉండటానికే డస్ట్‌బిన్లు


డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, ఎంపీడీవో సుజాత, తదితరులు

కొత్తపట్నం: గ్రామాలు పరిశుభ్రంగా ఉండి ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి డస్ట్‌బిన్లు బాగా ఉపయోగపడతాయని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డస్ట్‌బిన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 15 పంచాయతీలలో 13 వేల కుటుంబాలకు 17 వేల డస్ట్‌బిన్లు వచ్చాయన్నారు. ఒక్కో కుటుంబానికి రెండు డస్ట్‌బిన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇంట్లోని తడి, పొడి చెత్తలను వేరువేరుగా డస్ట్‌బిన్లలో వేసి చెత్త రిక్షాలలో వేయాలని కోరారు. దానిని చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలిస్తారని తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు డస్ట్‌బిన్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఏఓ నరేంద్రదేవ్, సుదర్శన్, ఆదిత్య, సర్పంచ్‌లు కట్టా సౌందర్య, ఎంపీటీసీలు గుడి అరుణ, మిటనసల శాంతారావు, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించాలి

ఒంగోలు టౌన్: భారత ప్రభుత్వం పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించాలని, పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధం ఆపాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక సాగర్ సెంటర్లో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ యుద్ధం వలన వేలాది మంది చిన్నారులు బలవుతున్నారని, ఇల్లులేక, తిండి లేక ప్రతి 15 నిముషాలకు ఒకరు చొప్పున చనిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని సమర్థిస్తోందని, మన దేశం ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలవడం సరైన నిర్ణయం కాదని చెప్పారు. ఆయుధాల వ్యాపారం కోసం అమెరికా సృష్టించిన యుద్ధాన్ని శాంతి కాముకులు, మానవతావాదులు తీవ్రంగా వ్యతిరేకించాలని సీపీఐ నాయకుడు ఉప్పుటూరు ప్రకాశం కోరారు. నిరసన ప్రదర్శనలో జి.రమేష్, పీవీఆర్ చౌదరి, లలితకుమారి, రఘురాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ

చీమకుర్తి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలోని జెడ్పీ బాలికల హైస్కూలు క్రీడాకారిణిలకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్, అధ్యక్షుడు బదరీనారాయణ ఆర్థిక సహకారంతో స్పోర్ట్స్ డ్రెస్ అందించారు. ఇదే హైస్కూలు నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇటీవల ప్రతిభ చాటిన ప్రియాంక, పవిత్ర, చాందినితో పాటు పీడీ స్వరూపావాణిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఎస్సై జీ రామిరెడ్డి, ఎంఈఓ ఎస్.వెంకటేశ్వర్లు, హైస్కూలు హెచ్‌ఎం జీ వీరాస్వామి, టీచర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజిరెడ్డి

- మండల సమావేశంలో అధికారులతో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 9వ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అంజిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంకు సంబంధించిన విత్తనాల కిట్లను ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజలకు తెలియకుండా పంపిణీ చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దీనిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, విచారించి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ, వెబ్ ల్యాండ్‌లో ఉన్న వారికి రైతు భరోసా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బీవీ రమణారావును ఆదేశించారు. గుండమాల నుంచి కె.పల్లెపాలెం వరకు 7 కిలోమీటర్లు మట్టి రోడ్డు వేస్తే దానిపై గ్రావెల్ వేయడానికి లేదని ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు అంటున్నారని, గ్రావెల్ వేసే విధంగా ఎన్ఆర్ఈజీఎస్ పీడీకి పంపించాలని కోరారు. రీ సర్వే చేస్తే ఒక్కో పేరు మీద రెండు ఎకరాల పొలం ఉంటే దానిని 10 ఎకరాలు, 8 ఎకరాలుగా పాసుపుస్తకాలు ఇవ్వడంపై ఎంపీపీ మండిపడ్డారు. రీ సర్వే సరిగా జరగటం లేదని, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రీ సర్వే చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. పంచాయతీ తీర్మానాలు ఇవ్వకుండా పనులు ఎలా జరుగుతాయని, తీర్మానాలు ఇవ్వాలని కోరారు. తహసీల్దార్ బీవీ రమణారావు మాట్లాడుతూ మండలంలో పాయికారి కంభ్రిక, రాజుపాలెం, పాదర్తిలో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. మడనూరు, ఈతముక్కల పంచాయతీలలో రీ సర్వే జరుగుతుందన్నారు. కో ఆప్షన్ సభ్యుడు బాజీ మాట్లాడుతూ అల్లూరు గ్రామానికి శ్మశానం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, మనిషి చనిపోతే ఎక్కడ పూడ్చుకోవాలో తెలియడం లేదని, శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. వర్షాలు లేనందున కరువు మండలంగా ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అధికారులంతా శాఖలవారీగా పథకాలపై చర్చించారు. సమావేశంలో జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పీహెచ్‌సీ డాక్టర్ వైష్ణవి, వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి, ఏపీవో రత్నజ్యోత్స్న, పీఆర్ ఏఈ శేషగిరిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు


డీలర్లతో మాట్లాడుతున్న ఏఓ రమేష్

మద్దిపాడు: అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో సభ్యులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సలహామండలి సభ్యులు వ్యక్తిగతంగా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు ఇవ్వాలని కోరారు. జేజీ 11 రకం శనగలకు బదులుగా కాక్-2 శనగలు కావాలని గ్రామాల్లో రైతులు అడుగుతున్నారని సభ్యులు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖాధికారి రమేష్ మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో శనగ విత్తనానికి విత్తనశుద్ధి చేసుకునే క్రమంలో క్యాప్టర్ లేదా మాంకోజెబ్ మూడు గ్రాములు లేదా ర్యాగ్జిల్ 1.5 గ్రాములు లేదా విటావ్యాక్స్ 1.5 గ్రాములను ఒక కేజీ విత్తనాలకు వాడుకోవాలని తెలిపారు. విత్తనం వేసిన 24 గంటల్లో స్టాంప్ (పిండి మిథాలిన్) ఒక లీటర్ చొప్పున చల్లుకోవాలని తెలిపారు, అనంతరం డీలర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాపులకు సంబంధించిన పత్రాలు ఉంచుకోవాలని, రైతులకు ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ ద్వారా ఎరువులు సరఫరా చేయాలని తెలిపారు. రైతులకు కొనుగోళ్లకు సంబంధించిన రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని, యాక్ట్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
MAHINDRA ALFA DX DIESEL
BSVI 2021 MODEL AP39 UB 0028
Cell : 99594 43604
37-1-14, 2nd Floor, Vara Prasad Complex, Beside East KB Restaurant, Trunk Road, ONGOLE.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762 90102 02856
Office mail : sakshiongads@gmail.com